# మనస్సులో కథల కార్ఖానా

(కథానిక)

వి. వి. అప్పారావు

ఏమీతోచక పార్కులోకి పోయాను. ఆనాడు నిజంగా జీవితంలో మొదటిసారిగా నా మనస్సులో ఏవేవో వింత ఊహలు రావడం దానికి కారణం. ఆ వింత ఊహలకైనా మనసుండ నక్కర్లా? నాలాంటి అమాయకవ్యక్తిని వెంటాడితే వాటికి లాభం ఏమిటి?

ఇంతకీ వింతేమిటో అనే ఆలోచన కలిగేముందే దానిని విషయం తెల్సుకోవడం మంచిది. నాలో గొప్పలోపొకటుంది, అది ఏమిటంటే నాకు ఐడియాలు ఎక్కువ. వీటికి ఆహారం తక్కువ. చిన్నప్పటి నుంచీ కవిత్వంలో, కథనంలో, కోతల్లో, కల్లకబుర్లలో నాకు ఆసక్తి ఎక్కువ. కాని ప్రతీదానికీ ఉండవలసిన పెద్దలోపం ఏదోఒకటుంది. కవిత్వం కడతానా! దాంట్లో కవి లక్షణా లుండవు. కవిత్వలక్షణాలస లుండవు. కాని నాకదికవిత్వమే! ఏం చేయను, ఒచ్చిందేఅది. ఇంక కథనంలోని కథ 'స్టార్ట్'అవుతుంది. నడుస్తుంది. పెద్ద కథ వస్తోందనుకుంటాను. బుస్సుమ నీ'ఎండింగ్'క్షవర మైపోతుంది. ఒక్క కథా 'ఫినిష్' చేయలేదు. అన్నీ ఆవలిస్తూ అల్లానే ఉండిపోయాయి. నే నెన్నో ఐడియా లివ్వడం, ఎవ్వడో ఒకడు ఆకథ వ్రాసి పారెయ్యడం, నా దురదృష్టంకొద్దీ అది నాకంట పడటం సామాన్యమయింది. ఇన్ని ఇన్ని ఐడియా లుండి ఏంలాభం బ్రెయినుకు అవసరమొచ్చినప్పుడే బ్రేకుపడితే? ఇంక కోతలు, కల్లకబుర్లలో ఆ లక్షణాలులోపం. మనం ఏంచేదామనుకుంటామో దానిలో ముఖ్యమైన 'రసం' లోపిస్తూ ఉంటుంది.

ఓనాడు పెద్ద ఒడియా ఒకటొచ్చింది. దాని 'సొల్యూషన్' రాలేదు. ఎందుచేతంటే 'ప్లాటు' పెద్ద 'స్టాండర్డ్'లోది. పార్కులో ముఖాలు కనిపిస్తాయిగాని ఐడియాలు దొరకవు. అన్ని ముఖాలు అంత వాతావరణం జాగ్రత్తగా పరిశీలించడం ఆరంభించాను, సొల్యూషన్ దొరుకుతుందేమోనని. నా అదృష్టవశాత్తు దూరాన భాస్కరరావు మేష్టారు కన్పించారు. గట్టిగా కేకేశా. ఆయన నావైపు వస్తున్నారు.

భాస్కరరావుగారు నాకు పరిచయమై ఎన్నాళ్లో గాలేదు. కాని ఆయనకి నాలో ఇంటరెస్టు ఎక్కువ. ఆయన్ని కవంటారు 'ఐడియాస్'లో. ఆయనవ్రాశే కథలకు 'ఎండింగ్' బాగుంటుందంటారు. ఎటువంటి 'పేల్ ప్లాట్' అయినా 'లవ్ లీ' ఎండింగ్ చేస్తారని పేరు. నేనుగాని నాస్నేహితులుగాని ఎవ్వరూ ఆయనకథలు చదవలేదు!

"నమస్కారం మాష్టారూ"

"ఏ మోయ్ మణీ కులాసాయేనా? ఎనీ మోర్ ఐడియాస్?"

"మీ ముందర మేమెంతగాని ఓ చిన్న ఐడియా!"

"ఏమిటీతైరు? ఆ! ఐడియానా లవ్ లీ-కమాన్."

ఇద్దరం కూర్చున్నాం. నేను ఆరంభించాను. ఆయన వింటున్నారు శ్రద్ధగా.

"...వెంకటేశం, పార్వతీశం అప్తబంధువుల్లాంటి స్నేహితులు. వారి పరిచయాన్నీ ఆప్యాయతనీ చూసి చాలామంది వారిమీద అసూయ పడ్డారు. ఒకరికొకరు తోడుగాఉంటూ వాళ్ళిద్దరూ అన్యోన్యతలో ఎవరితోనూ పోలికలేకుండా ఉండే వారు. పార్వతీశానికి పార్వతి సహధర్మచారిణి. కాని కొత్తల్లోకన్నా మెల్లమెల్లగా పార్వతి వెంకటేశంతో 'ఫ్రీ'గా మెలగడం మొదలు పెట్టింది. అదైనా అతని పరిశుద్ధ మనస్తత్వాన్ని అర్థంచేసుకున్నాక.

ఈ మిత్రులిద్దరూ ఒక యింట్లోనే రెండు భాగాల్లో ఉంటూఉన్నారు. ఇద్దరికీ 'గార్డెనింగ్' అంటే సరదా. పూలు అంటే మరీనూ. ఉన్న చిన్న పెరడులో మల్లెగట్టి మొక్కలునాటేవారు. పూలు పళ్లు, ఫలితాన్ని యిద్దరూకలిసి ఆరగించేవారు. బాంధవ్యంలో బరువు, ఆప్యాయతలో ఆత్మీయత వారిద్దరూ త్వరలోనే పొందగలిగారు.

ఒకరోజున పార్వతీశం ఆఫీసునుంచి హడా వుడిగా పరిగెత్తుకొచ్చాడు. మిత్రుడిని పిలిచి ఒక విశేషం తెచ్చానన్నాడు. పొట్లంతీసి రెండు విత్తనాలు చూపాడు.

"ఏమోయ్ రెండేరెండు అబ్బురంగా దొరి కాయి. ముద్దగులాబీ! కళ్లు చెదిరేఅంత పువ్వు, కమ్మటి సువాసనలతో చాలా బాగుంటుంది. నేనీ పువ్వు 'బుక్కు'లో చూశా. చాలా కష్టంమీద సంపాదించగలిగా. నువ్వొకటి-నేనొకటి తీసుకుని పెంచుదాం!" అన్నాడు.

"అబ్బురంగా తెచ్చిన విత్తనాలన్నావు, నువ్వు వేసిపెంచు, నేను చూసి సంతోషిస్తా నీతోపాటే." పైగా నాచేతివాసి నీకు తెలుసుగా. ఇంతవరకూ మన చేతితో ఏమొక్కా వేయలేదు. వేసినా బతుకుతుందనే నమ్మకం నాకులేదు. కాబట్టి నువ్వేగాసీ" అన్నాడు వెంకటేశం.

పార్వతీశానికి కోపం చూపింది, తన మిత్రుడు ఈవిధంగా తనని 'డిస్కరేజ్' చేసినందుకు. వెంక టేశానికి అర్థమయ్యింది. కాని తిరిగి చెప్పాడు పరిస్థితి. చివరికి బలవంతాన్ని లెక్కచెయ్యాల్సొచ్చింది. పార్వతీశమే ఆవిత్తనం వెంకటేశం పక్క నాటుతానన్నాడు.

ఇంతకీ వారిద్దరూ, పెరట్లో ఎవరిభాగం వెన కాలవాళ్లు 'ఆర్బిటరరీ'గా వాళ్ళదనుకుంటూ మెలుగు తున్నారు. విడిగా 'పార్టిషన్' అంటూ ఏం లేదనుకోండి."

మాష్టారు కనుబొమలు ముడిచి, సిగరెట్టుతీసి ముట్టించారు. ఆ మంటలోకి చూశారు. గట్టిగా దమ్ములాగి ఆపొగ ఉంగరాల్లోకి దృష్టిపోనిచ్చారు. కాబట్టి ఆయన "కింటరెస్టింగా" ఉందని తెలిసింది. ముందుది ఊహిస్తున్నట్లనిపించింది.

"సో బలవంతంమీద వెంకటేశం భాగంలో పార్వతీశం ఒకవిత్తనం తనంతట తానే తెచ్చి నాటాడన్నమాట 'ఏమ్ ఐరైట్'?"

"అవునండి మాష్టారు అంతే"

" 'ఆల్ రైట్' తర్వాత?"

"...ఇద్దరూ ఆ విత్తనం మొక్కలవడం చూశారు. వారు చాలా జాగ్రత్తగా, ఎక్కువ అభిమానించుకుని, శ్రద్ధతో ఆవిత్తనాల పోషణ చేయడంలో వింత ఏమీ లేకపోవడం, సహజంగా పరిగణింపబడటం వల్ల ఏ ఒక్కదానికీ ప్రత్యేకత లేకపోయింది. మొక్కలు మెల్లగా పెద్దవవుతు న్నాయి. మనిషిలాగే, శైశవం, బాల్యం, కౌమార్యం..."

"చాల్లే! కవిత కాదు కావల్సింది, ఫాక్ట్స్" అన్నారాయన సిగరెట్టు పారేస్తూ.

...కాని అదృష్టం వేరువిధంగా తల్చింది. పార్వతీశం మొక్క ఒకరోజున వాడింది. వెంక టేశం, పార్వతీశం యిద్దరూ కంగారుపడ్డారు. దానికి ఉపచర్యలు చేశారు. కాచుకు కూర్చు న్నారు. కాని దాన్ని నిలుపుకోలేకపోయారు. పార్వతీశం దొడ్లో మర్నాటికి ఆ మొక్క లేని వెలితి స్పష్టమయ్యింది.

అభిమానంతో, ప్రత్యేకంగా తెచ్చుకున్న విత్తులు...దాంట్లో ఆనందం పొడసూపే సమ యంలో...ఆ మొక్క తనదిగాకుండాపోయింది. ఏనాడో విన్న జడభరతుడి కథ స్ఫురణకు వచ్చింది. మనసంతా ఆ మొక్కమీదే ఉంది. కలల్లోకి గూడా వచ్చిన ఆ మొక్క, ఆ పువ్వు తనని చూసి, తన పరిస్థితిని చూసి జాలిపడి, కల్లయి పోయాయి.

వెంకటేశం, పార్వతీశాన్ని ఓదార్చాడు; ఏదో నష్టపడినవాడికి ధైర్యం యిచ్చినట్లుగా. గుండె ధైర్యానికి సమయమే అది. పార్వతీశం మనసు ముడుచుకుంది.

ప్రక్కన వెంకటేశం భాగంలో రోజామొక్క చిలిపినవ్వు లొలకబోస్తోంది. దినదినం అది ఎదుగు తోంది. ఒకనాటి ప్రొద్దున వెంకటేశం పరుగెత్తు కెళ్ళి పార్వతీశాన్ని కేకేశాడు. చూపాడు... ఆనందం అంచలంచలుగా వస్తోంది. రోజా మొగ్గొ క్కటి వేశింది; సాయంత్రానికి విడుపుచూపింది.

మర్నాడు పార్వతీశానికి కానుక- వెంకటేశం యిచ్చిన రోజాపువ్వు.

"ఎంత బాగుందోయ్. నేనింతవరకూ యింత కమ్మటి రోజాను చూడలేదు; ఎంత పెద్దదో పైగా!" అంటూ సంబరమొలకబోస్తున్న వెంకటే శానికి సమాధానం రెండుసార్లు అవుననడం. పార్వ తీశం ఆనందం చూపాడు.

రోజులు గడుస్తున్నాయి. రోజా మరి రెండు పూలుపూసింది. వెంకటేశం, పార్వతీశంతో కలిసి ఆనందిస్తున్నాడు.

వెంకటేశం హృదయంలో ఒక్కటి స్థిరంగా ఉంది. పార్వతీశం దొడ్లో మొక్క పోయినందుకు విచారం; అదిగూడా ఇంకో పద్ధతిలో లేదు. కారణం- పార్వతీశం మొక్కగా తన దొడ్లో ఉన్నది. పార్వతీశం విత్తు తీసుకొచ్చి, దాన్ని తన చేతులతోనే అక్కడ నాటి, నీళ్లుపోసి పెద్దదాన్ని చేశాడు. ఇది పార్వతీశానికిగాక తనదా! అందుకనే పార్వతీశం ఆనందిస్తున్నాడు, తనతోపాటు. ఆప్త మిత్రుడు.

పార్వతీశం మనసే వేరు. తను అబ్బురంగా తీసుకువచ్చి నాటిన మొక్క నశించింది. వద్దంటున్నవాడి యింట్లో పెరిగింది— పూలుపూస్తోంది. తనకు కన్నెర్రగా ఉండటంసహజం. తాను తెచ్చిన విత్తయినా, మొక్క ఆదొడ్లో పెరిగింది. అదృష్టం వాడిది. తనదేముంది? ఒకసారి యిచ్చాక అది వాడిదే. తనకు తీసుకొచ్చి యిస్తాడు. అవును— తనదిగాబట్టి, నాకు మొక్క లేదుగాబట్టి ఏడిపిస్తాడు- సహజం.

వెంకటేశం మనసు నిష్కల్మషంగా ఉంది. పార్వతీశం మనసు కుత్సితమయిపోయింది.

పార్వతీశం అప్పుడప్పుడు ఆ మొక్కను చూస్తాడు. అది వెక్కిరించినట్లుంటుంది. నవ్వినట్లుంటుంది. ఇది మొత్తంగా యితని మనసును బాధించినట్లవుతుంది. ఒక్కొక్కసారి అనిపిస్తుంది దాన్ని పీకిపారేద్దామని. అప్పటికి తన మనసుశాంతిస్తుందా? ఆ! శాంతిస్తుంది. కాని వెంకటేశం ఏమనుకుంటాడో? ఏమనుకుంటాడు- తన మొక్క. దాని మీద తనకధికారంలేదా? అయినా నిండుగాఉన్న ఆ మొక్కను పీకివేయ బుద్ధి తనకెలా కల్గిందో? కలగకేం?...అనే ప్రళయద్వేషంలో కొట్టుకుంటున్నాడు పార్వతీశం.

వెంకటేశానికివన్నీ తెలీదు. మనసులు చదవదలచనివాడు— ప్రశాంతంగా ఉన్నాడు. మొక్క గూర్చి ఎక్కువగా పార్వతీశంతో మాటాడుతాడు...

"ఇదీ పరిస్థితి. దీన్నేం చేయమంటారు?" అన్నాను నేను నా కథ అంతా చెప్పి.

మేష్టారు ఆలోచిస్తున్నారు. నిదర్శనం దట్టంగా వదిలే సిగరెట్టు పొగ.

"ఏముందీ, రాసీ!"అన్నారాయన.

అర్థంగాక సతమతమవుతూంటే నేను, ఈయన 'రాసీ' అనేశాడే అని ఆశ్చర్యపోయాను. చిన్న నవ్వునవ్వారు.

"థీమ్ బాగుంది, ఎండింగ్ నాట్ సో సింపిల్" అన్నారు. నేనేమనాలో అర్థంగాక నిశ్శబ్దాన్ని భోంచేస్తున్నాను.

"నువ్వెలా ఎండ్ చేద్దామనుకున్నావ్?"

చెప్పక తప్పిందిగాదు.

"నాకు రెండువిధాలు తోచాయండీ. ఒకటి మాత్రం తథ్యం. ఇది కొంచెం కఠినంగానే ఉండొచ్చు చదువరులకు."

"అంటే- పంజంట్?"

"ఆ! ఆ!"

"పుయ్ షల్ సీ— కమాన్— కానీ" అన్నారాయన.

"పార్వతీశంలోని బాధ—నా ఉద్దేశ్యంలో సహజమేననుకుంటాను—నానాటికీ పెరుగుతుంది. ఇది అసూయగా పరిణమించి కంట్రోలు తప్పిపోయి ఓరోజున ఆ మొక్కను పీకిపారేస్తాడు. అంతతో దాని చరిత్ర అంతరిస్తుంది."

"యిది ఎల్లా పాసిబుల్. లోకంలో సామ్యం ఉందిగా! 'నారుపోసినవాడు నీరుపొయ్యాలని!' అందువల్ల అవుట్ ఆఫ్ కొశ్చన్. ఈ ఎండింగ్ ఏం బాగాలేదు, ఎనీ మోర్?"

"మా స్నేహితుడింకో రకంగా సాల్వు చేశాడు. అదేమిటంటే వీడి స్థితి చూసిన వెంకటేశం తనంత తానే ఆ మొక్కను పీకిపారెయ్యాలి."

"అబ్‌సర్డ్! అదెల్లా? నీవు చెప్పినట్లయితే క్లియర్‌గా వెంకటేశం పార్వతీశం యిలా ఫీలవుతున్నాడని ఎరగడుగా!"

"అవునండి, అందుకే! నేనూ యీ సొల్యూషన్—"

"నాట్ ఎట్ ఆల్ గుడ్—కాబట్టి—"

"మీరేదైనా చెప్పండి సార్!"

"యస్. యస్. ప్రపంచంలో థియరైజ్ చేయబడిన 'నారుపోసినవాడు' తీసుకుంటే, పార్వతీశం మనస్సులో ఎంతబాధపడ్డా తనచేత్తో దాన్ని పీకెయ్య

లేదు. కాబట్టి వాడు 'నీరుపోసి తీరాల్సిందే.' అదటుంచి మిగిలిన సొల్యూషన్ గూర్చి ఆలోచిద్దాం. వెంకటేశానికి, పార్వతీశం మనస్తత్వం తెలుసుకునే ఛాన్సు ఉంటే ప్రాబ్లెమ్ సాల్వవుతుంది. దీనికిగాను ఒక 'ఇన్సిడెంట్' పెడదాం."

"ఏరకమైన ఇన్సిడెంటండీ?"

"వెంకటేశం కలత నిద్రలో కలగంటాడు. దాంట్లో తనూ, మరెవరో, మొక్కను జాగ్రత్తగా పోషిస్తున్నట్లు, ఇంతలో ఎవరో ఒకరువచ్చి తాము ఏమరికతో వున్నప్పుడు దాన్ని పీకి పారేయబోతున్నట్లు, అదిచూసి తను అడ్డగించబోయినట్లు- ఆ సమయంలో తనతో ఉన్నవ్యక్తి చూస్తూ నిల్చిపోయినట్లు."

"తరవాతండీ."

"వెయిట్ - 'ఈ హడావుడితో వెంకటేశానికి మెలకువ వస్తుంది. గట్టిగా అప్పుడైన పార్వతీశాన్ని కేకేస్తాడు.

ఆ సమయంలో పార్వతీశం మనస్సు కలతగా ఉండి, ఆ చెట్టు భావిజీవితాన్ని ఊహిస్తూ నిశ్చయానికి రాలేక, దొడ్లో వరండాలో పచార్లు చేస్తూ ఉంటాడు.

స్నేహితుడి అరుపువిని వెంటనే వెళ్తాడు. ఆ సమయంలో వెంకటేశం వణుకుతూ, కంగారుగా వచ్చినకల కథావిధానం చెబుతాడు. ఆ భయం చూస్తే అతనికి ఆ మొక్కమీదగల ఆత్మీయత స్పష్టమవుతుంది. ఇప్పుడు రెండు సొల్యూషన్సుకి స్కోప్ ఉంది."

"చెప్పండి మాష్టారూ—సిట్యుయేషన్ సింపిల్ అయినా చాలా ఎఫెక్టు తీసుకొచ్చారు."

"ఆల్ రైట్—అయితే విను.

మిత్రుడి స్థితి పూర్తిగా అర్థం చేసుకుంటాడు పార్వతీశం. తనమనస్సులో ఉన్న యుద్ధం సంగతతనికేం తెలుసు. పైగా దొడ్లోకి పరుగెత్తి తనని పిలిచే అతన్ని చూసి, తనకు ఆ మొక్కమీద అతనితోపాటే, అతనంటే అభిమానం ప్రేమ ఉన్నాయనుకుంటున్నాడు. కాని తనో, తన మనసో, కుత్సితమయి పోయింది. తను తనమిత్రుడికెంత ద్రోహంచేస్తున్నాడు! కానరానట్లుగా తన ఊహాలను వృద్ధిపరచుకున్నాడు. తను ద్రోహి.

ఈ ఊహాలు రాగానే ఒక్కసారి అభిమానం అంచులుదాటి ప్రవహించి, తను పరుగెత్తుకెళ్ళి తన స్నేహితుని కౌగలించుకుంటాడు. మొక్క కులాసాగా ఉందిగదా అని పట్టుకు చూస్తాడు. వెంకటేశం చెక్కిళ్ళమీదపడ్డ కన్నీళ్ళ అర్థం ఎంతో వెంకటేశం, పార్వతీశం అనందాలకు అంతం ఉందో లేదో—"

"సుపర్బ్—మాష్టారూ — కాన్ఫ్లిక్ట్ కి చాలా స్కోప్ యిచ్చారు."

"కాని—"

"కానీ అని ఆపేశారేం?"

"నాకింకో సొల్యూషన్ మీదికి పోయింది. దీనిలో పీక్సెఫ్ పార్వతీశం మనస్సు మారిందనడం- రీడర్ని సాటిస్ఫై చేయడం కష్టం ఆ సిట్యుయేషన్లో."

"మరేం చేస్తారు?"

"ఆల్టర్ నేటివ్ ఈజ్...కల అంతా విన్నా పార్వతీశం గుండె గండి పూడదు. పాలుపోసి పోషించిన, పెంపొందించిన కుత్సితం ఒకపట్టాన తగ్గడం అసంభవం. పైగా వాడు ఏదో ఆనందం తనది, స్వంతం చేస్తున్నాడన్న 'సైకాలజీ డెవలప్' అయిన ఆ మనస్సుకిది ట్రీట్ గానే- కాపట్యం దాచుకోడం కష్టం.

ఇంత విషాదసంఘటనను 'నెరేట్' చేశాక గూడా అతని ముఖంలో మార్పు రాకపోవడం ఏదో గంభీరంగా ఆలోచనలో ఉన్నట్లగుపించడంతో అనుమానం అంకురిస్తుంది వెంకటేశంలో. ఆగలేక పరుగుతోపోయి మొక్కస్థితి చూస్తాడు. మొక్క ముక్కుపచ్చలారని మొగ్గకన్నెలతో మొగమోటం లేకుండా మామూలు ముసిముసి నవ్వుతొలకపోసింది. తన అదృష్టాన్ని 'థేంక్' చేసుకున్నాడు.

తిరిగివచ్చి మొక్క కులాసాగానే ఉందని చెబుతాడు పార్వతీశం గుండెల్లో గొడవ తెలీక. నవ్వ ప్రయత్నించి పార్వతీశం వెనుతిరిగి చూడకుండా చెప్పకుండా తనభాగంలోకి వెళ్ళిపోతాడు.

వెంకటేశం మనస్సు అన్ని ఆలోచనలు చేసింది. ఇదమిత్థమని తేల్చుకోలేక పోయింది. కాని మిత్రుని స్థితిలో యింతదాకా తననుకోని మార్పు ఏదో వచ్చిందని తెలుసుకుంది. మనస్సు గాయ

పడింది. తను వద్దని చెప్పాడు. కాదని మిత్రుడు ఆ విత్తనం తనవైపు నాటాడు. అది అతని చేతి మీదుగానే పెరిగింది. దాని విధేయత అంతా పార్వతీశానికే. అది అర్థం చేసుకోలేక పోయాడతను. పాపం ఆవేశంలో అసలు పాయింటు మిస్సయ్యాడు. సింపథైజ్ చేశాడు. తనక్కడ ఉంటే పరిస్థితి వర్సెనవుతుందనుకున్నాడు.

మర్నాడు వెంకటేశం ఇల్లు మారాడు. మనస్సులు మారితే యిల్లొక లెక్కా. కారణం ఆ యింట్లో ఏదో వచ్చినప్పటినుంచీ నష్టజాతకమని చెప్పాడు. పార్వతీశం ఈ 'సడెన్ డెసిషన్' విని 'స్టుపిఫై' అవలేదు. 'ఆల్ రైట్' అనాలేదు. విని ఊరుకున్నాడు."

"అయిపోయిందా?"

"ఏం! అయ్యింది."

"చిన్న సజెషన్, మర్నాడు పార్వతీశం ఈ భాగంలోకి మారాడంటే ఎలా ఉంటుంది?"

"ఎందుకంత క్రూయెల్‌గా ఉండటం."

"వాడి మనస్సింతా బాగా తెలుస్తుంది."

"యువర్ విల్."

"మాష్టారూ ఈ సొల్యూషన్ ఎడాప్టుచేసి వ్రాసేస్తాను - మీకు చూపుతాను - ఏమంటారు?"

"ఆల్ రైట్ - నే నెప్పుడు కాదన్నాను. సాక్రిఫైస్ ఈస్ మై బర్త్ రైట్."

"సో—ది అథర్ విల్ బి గ్రేట్ ఫుల్ టు డాక్టర్ రావు."

"దానికేంలే ఎప్పుడూ ఉన్నదేగా."

"అయినా మెన్షన్ చేయకపోతే ఐ ఫీల్ గిల్టీ."

"థ్యాంక్స్"

మే మిద్దరం విడిపోయాం. ఆ రోజున ఎండింగ్ యొక్క డిఫకల్టీ నాకు తెలిసింది. ఆ కథ వ్రాసేశాను—అంతే!

---

కథానిక

# స్వర్ణయోగం

## "భాస్కరం - ప్రభాకరం"

జుట్టు పట్టుకుని ద్రౌపదిని దుశ్శాసనుడు సభలోకి ఈడ్చుకొచ్చినట్టు, మెడపట్టుని టార్జాన్‌ని గదిలోకి లాక్కొచ్చాడు శేషు.

"చూశావురా, నీడిటుక్కులు? మెయిన్ రోడ్డు మీద నా కెదురొస్తున్నాడు. నన్ను చూడగానే పక్కసందులోకి మళ్ళి పోయాడు. నేను చూడలేదనుకున్నాడు. పోనిచ్చానా, వెనకాలే వెళ్ళి పట్టుకుని, కథ చెప్పనులే రమ్మని నాతో తీసుకొచ్చాను" అన్నాడు శేషు.

"అవునుగాని రాఘవులొచ్చాడు వూళ్ళోకి, తెలుసా?" అన్నాను.

"తెలియడమేమిటి! ఇప్పుడు రాఘవులు దగ్గర్నుంచేగా నేను వస్తున్నది!" అన్నాడు శేషు.

"ఏమిటి విశేషాలు?" అని అడిగి నాలిక కరుచుకున్నాడు టార్జాన్.

"అడిగావూ? అదే చెపుదామనుకుంటున్నాను. నువ్వే అడిగావు. విను." అని ప్రారంభించాడు శేషు.

"క్వార్ట్జ్—గార్నెట్—సిలిమనైట్ గ్రాఫైట్ షిస్టు. స్ట్రైకింగ్ నార్త నలభయ్యాయిదు డిగ్రీలు ఈస్టు డిప్పింగ్ యాభయ్యారు డిగ్రీలు సౌత్ ..."

ఫీల్డు నోట్సు రాసుకుంటున్న రాఘవులు కళ్ళు మిరుమిట్లు గొల్పేలా మెరుపుమెరిసి ఫెళఫెళమని ఉరిమింది. ఉత్తరాన దూరంగా కాటుక కొండలా మబ్బుకనపడి మదించిన ఏనుగులాముందుకొస్తోంది.

రాఘవులు నోట్సురాయడం ఆపుచేశాడు. రిస్టువాచీ చూసుకున్నాడు. అయిదయింది. సామాన్యంగా ఆరున్నర అయితేగాని చీకటిపడటం లేదు. అందుచేత ఏ రోజు కారోజు తన ప్రోగ్రాం ప్రకారం ఫీల్డువర్కు సాగిపోతూవుండేది. ఇవాళ తను వేసుకున్న ప్రదేశం చిన్నదే అయినా గుట్టలూ మిట్టలూ ఎక్కడందిగడంతో ఆలస్యమయిపోయింది. ఇంకా సగం ఏరియా వుండిపోయింది.

మబ్బు వేగంగా మూసుకువస్తోంది. రాఘవులుకి ఏమీ పాలుపోలేదు. వీలయినంత త్వరగా క్యాంపు